'పరిమళా!' అనే కేక వినబడింది. అంతలో లైట్లారిపోయాయ్. సినిమా మళ్లీ మొదలైంది. నా మనస్సులో పాతికేళ్ల క్రింద కాలేజీలో పరిచయమైన పరిమళ మెరిసింది. చదువైన తరువాత ఉద్యోగం! అదిన్నీ సెంట్రల్ సర్వీసే మొత్తం రాష్ట్రాలన్నీ తిరిగిరావటం! ఈ లోగా ఓ మంచి పుస్తకం చదివినా, ఓ మంచి పాట విన్నా పరిమళే గుర్తు వచ్చేది.

నిజానికి పరిమళ నాకే కాదు, పరిచయమైన ప్రతి మనిష్వికీ గుర్తుంటుంది. ఆ అందం అట్లాంటిది. సామాన్యంగా కాస్త తెల్లగా ఉండే అమ్మాయికి ఆ

## ఆలోచనా పరిమళం

అందానికి రెట్టింపు గర్వం. ఆ తలబరువుకి కళ్లు కనిపించవ్. ఎవరన్నా తనను చూస్తున్నారని తెలిస్తే అంతవరకు తాను చూసే అబ్బాయినైనా చూడటం మానేస్తుంది. కాని పరిమళ అట్లాంటిది కాదు.

ఆ రెండేళ్ల కాలేజీ జీవితంలోనూ నాతో మాట్లాడింది పది మాటలే కావచ్చు. అదిన్నీ ఏ రెండు మూడు సార్లయాలో కావచ్చు. కాని జీవితమంతా జ్ఞాపక

## కాలమ్ దాటిన కథ

ముంచుకోదగినట్లు మాట్లాడేది. మాటలకన్నా చల్లగా చూసేది, మెల్లగా నవ్వేది. అవే మరీ ఆప్యాయంగా అనిపించేవి.

మా గ్రూప్ సబ్జక్ట్సు వేరు కావటం మూలాన లాంగ్వేజస్‌కే కలిసేవాళ్లం. ఆ కాలంలో మాష్టర్లు పాఠం చెప్పాం, మన పనైపోయింది అనుకోకుండా అప్పుడప్పుడు ప్రశ్నలు వేసేవారు. నన్నడిగారే అని విద్యార్థులూ బాధపడేవాళ్లు కారు.

ఓసారి ఓ ప్రశ్నకు ఆడపిల్లల్లో పరిమళ, మరో ప్రశ్నకు మగపిల్లల్లో నేనూ సరిగా సమాధానం చెప్పాం. అప్పుడు చూసింది పరిమళ మొదటిసారి. అంతకు ముందెన్నిసార్లో చూసి ఉంటుంది కాని అవి లెక్కలేదు. అప్పటి ఆమె చూపులే నాకు కితాబులైనాయి.

తరువాత కాలేజీ మేగజీన్‌లో నా కథ చదివిన పరిమళ నన్నెంతో మెచ్చుకొంది. నాకు యూనివర్సిటీ ఫస్టు వచ్చినంత సంతోషించాను.

పరీక్షలై ఇళ్లకు వెళ్ళిపోతున్న పరిమళ రైల్వే స్టేషన్లో కనిపించింది. నేను మా స్నేహితుడికి సెండాఫ్ ఇవ్వటానికి వెళ్ళాను.'పరీక్షలు బాగా రాశారా'అన్నాను.'మీకు యూనివర్శిటీ ఫస్టు వస్తుంది'అన్నది పరిమళ.

తరువాత చాలాకాలానికి పరిమళనాకథను మెచ్చుకొంటూ తన అభిప్రాయం ప్రకటించింది ఆంధ్రజ్యోతిలో. ఈ సారి ఆమె విమర్శనా శక్తి ఎంత పెరిగిందో ప్రతి పదంలోనూ స్పష్టమైంది.

మళ్లీ నా కథలు చాలా అచ్చయినాయి కాని పరిమళ అభిప్రాయం అచ్చుకాలేదు.....

.... .... .....

ఇంటర్వెల్‌తో ప్రారంభమైన పరిమళ ఆలోచనా తరంగాలు సినిమాతో పాటు ముగింపుకొచ్చాయి. అంత మంది ఆడవాళ్లలో మన వాళ్లను గుర్తుపట్టాలంటేనే ఏ చీర కట్టుకొచ్చారో గుర్తుతెచ్చుకోవాలి. మరి పరిమళ ఎలా ఉంటుందో- ఎట్లా గుర్తుపట్టగలం?

ఇంతకూ ఆ పరిమళ మన మెరిగిన పరిమళే కావాలని ఏముంది? అందరితోపాటు హాలు విడిచి నడుస్తున్న నాకేం మిగిలింది? ఆ పరిమళ ఆలోచనా పరిమళం తప్ప!

—చిట్టా దామోదర శాస్త్రి

